ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి 2024

వాలంటీర్లకు తాయిలాలు

పాలకొండ : ఎన్నికలు నోటిఫికేషన్ విడుదలకు కొన్ని గంటల ముందే వాలంటీర్లకు అధికార పార్టీ నాయకులు తాయిలాలు అందించారు. వైసిపి రాష్ట్ర కార్యాలయం నుండే వాలంటీర్లకు రూ.5వేలు నగదుతో పాటు, డ్రెస్ పంపించినట్లు తెలుస్తుంది. వీటిని నగర పంచాయతీ పరిధిలోని వాలంటీర్లకు గోపాలపురం దగ్గరున్న ప్రైవేట్ కల్యాణ మండపంలో పంపిణీ చేసినట్లు తెలిసింది. దీనికి నియోజకవర్గంలో ఇద్దరు ముఖ్య నేతలతో పాటు పట్టణ నాయకులు హాజరైనట్లు సమాచారం.

చీరల ప్యాకెట్లు తీసుకొని వస్తున్న వాలంటీర్లు

సార్వత్రిక ఎన్నికల నగరా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం పార్లమెంట్, శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో తక్షణమే మోడల్ కోడ్ అమల్లోకి వచ్చింది. దేశంలో 4 విడత ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోను, జిల్లాలోను ఎన్నికలు జరుగనున్నాయి. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల గడువు ఏప్రిల్ 25 కాగా, 26న పరిశీలన ఉంటుంది. 29 వరకు ఉపసంహ రణకు గడువు ఇచ్చారు. మే 13న పోలింగ్ జరుగ నుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

మోగిన ఎన్నికల నగారా

- వెలువడిన షెడ్యూల్
- ఎన్నికల కోడ్ తక్షణం అమల్లోకి
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఇప్పటివరకు 7,75,598 మంది ఓటర్లు
- 1031 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఎన్నికల నిర్వహణ పనిలో నిమగ్నమైంది. ఓట్ల జాబితా మొదలుకుని, పోలింగ్ కేంద్రాలు గుర్తింపు, బూత్‌లు, అక్కడ సదుపాయాల కల్పన, పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించడం నామినేషన్లను దాఖలు చేసే విధానం, సువిధ యాప్ ద్వారా ధరఖాస్తు చేసే విధానం తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఇఆర్ఒలకు, నోడల్ అధికారులకు శిక్షణ వంటి ప్రక్రియ సుమారు మూడు నెలలుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి శనివారం 3గంటల నుంచే అమల్లోకి వచ్చింది. మరోవైపు ఎన్నికల ఏర్పాట్లు, డేటా సమకూర్చడం వంటి పనులు జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) నేతృత్వంలో అధికారులు మరింత ముమ్మరం చేశారు. అధికారిక సమాచారం ప్రకారం... జిల్లాలో మార్చి 5వ తేదీ వరకు 15,41,001 మంది ఓటర్లుగా నమోదు అయ్యారు, వీరిలో 3,87,764మంది పురుషులు, 3.96,766 మంది మహిళలు, 68 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. వీరంతా తమ ఓట్లను వినియోగించుకునేందుకు వీలుగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 1031 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 6 పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ స్టేషన్లుగా రూపొందించారు. ఎన్నికల సంఘం విధి విధానాల ప్రకారం పోలింగ్ స్టేషన్లలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లకు ఎండ నుంచి రక్షణ కోసం షామియానా, సహాయం చేసేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ బృందాలు నియామకం, వాహనాలు, పోస్టల్ బ్యాలెట్లు సమకూర్చడం, ఇవిఎంల తరలింపు, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించే సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర అంశాలపై ఇప్పటికే అధికార యంత్రాంగం కసరత్తు చేసింది.

పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి 90 నిమిషాల ముందే మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో కొత్తగా హోం ఓటింగ్ విధానాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టింది. దీనికోసం ఓటర్లు ముందుగానే ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 85 ఏళ్ల వయసు పైబడినవారు, 45 శాతం వికలాంగత్వం ఉన్న వారు, కోవిడ్ బాధితులు తమ ఇళ్ల వద్దే ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించారు.

అమల్లోకి ఎన్నికల నియమావళి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల నోడల్ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ ప్రకటించిన వెంటనే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలు అధికారులు తక్షణం చర్యలు తీసుకుని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. జూన్ 6 వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందని వివరించారు.అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూంను కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక పరిశీలించారు.

ఎన్నికల దృష్ట్యా స్పందన రద్దు

ఎన్నికల కోడ్ వచ్చిన దృష్ట్యా స్పందన కార్యక్రమం సోమవారం ఉండదని ఇన్‌ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని, కావున తదుపరి ఉత్తర్వుల వరకు స్పందన కార్యక్రమం ఉండదని అన్నారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు.

ఫిర్యాదుల కోసం 24 గంటలూ పనిచేసే కంప్లయింట్ సెల్‌ను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

సిట్టింగ్‌లకే సీట్లు

- అరుకు ఎంపి సీటు తనూజ రాణి
- ఐదోసారి పోటీ కి రాజన్నదొర, మూడోసారి కదనరంగంలోకి పుష్ప శ్రీవాణి, కళావతి, రెండోసారి బరిలోకి జోగారావు

విజయనగరం, అరుకు ఎంపి అభ్యర్థులు

బెల్లాన చంద్రశేఖర్
విజయనగరం

డాక్టర్ తనూజరాణి
అరుకు

ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేఅభ్యర్థులు

పి.రాజన్నదొర
సాలూరు

పి.పుష్పశ్రీవాణి
కురుపాం

వి.కళావతి
పాలకొండ

అలజంగి జోగారావు
పార్వతీపురం


బొత్స సత్యనారాయణ
చీపురుపల్లి

ఎస్‌విఎస్ అప్పలనాయుడు
బొబ్బిలి

ప్రజాశక్తి - సాలూరు

మే 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాజాం, అరకు పార్లమెంట్ మినహా మిగిలిన అన్ని చోట్లా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపిలకు మరోసారి అవకాశం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో రానున్న ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులంతా పాతకాపులే. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోసారి ఛాన్స్ రాగా, అరుకు ఎంపి సీటు కొత్త వ్యక్తికి ఇచ్చారు. శనివారం ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద సిఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన జాబితాలో జిల్లాకు సంబంధించినంత వరకూ మార్పులు లేవు. ఒకరిద్దరు సిటింగ్ ఎమ్మెల్యేలపై ప్రజావ్యతిరేకత, అవినీతి ఆరోపణలు వున్నప్పటికీ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి వాటిని పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. సాలూరు నియోజకవర్గంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర ఐదోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. రాజన్నదొర రాజకీయ ప్రస్థానం 2004 ఎన్నికలతో ప్రారంభమైనది. మొదటిసారి పోటీ చేసిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. టిడిపి అభ్యర్థి ఆర్పీ భంజ్‌దేవ్ చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఓడిపోయిన తర్వాత భంజ్‌దేవ్ ఎస్టీ కాదని రాజన్నదొర న్యాయ పోరాటం చేశారు. ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో కేసు వేశారు. 2006లో భంజ్‌దేవ్ ఎస్టీ కాదంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అదే క్రమంలో రాజన్నదొరను ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు ప్రకటించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2024 ఎన్నికల్లోనూ ఆయన ఐదోసారి పోటీకి సిద్ధమవుతున్నారు. కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సిటింగ్ ఎమ్మెల్యేలైన పుష్ప శ్రీవాణి, కళావతిలకే మరోసారి అవకాశం దక్కింది. వీరిద్దరూ మూడోసారి కదనరంగంలోకి దిగుతున్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు మరో అవకాశాన్ని అధిష్ఠానం ఇచ్చింది. ఎమ్మెల్యేగా పనిచేసిన మొదటి ఐదేళ్లలోనే జోగారావుపై పార్టీ నాయకులు, కార్యకర్తల్లో వ్యతిరేకత కనిపించింది. అయినా దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సిఎం ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే అరుకు పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ శెట్టి తనూజారాణిని అధిష్టానం ప్రకటించింది.

విజయనగరంలోనూ సిట్టింగ్‌లే...

విజయనగరం జిల్లాలోనూ వైసిపి అభ్యర్థులంతా సిట్టింగ్‌లే. చీపురుపల్లి అభ్యర్థిగా టిక్కెట్ రాష్ట్రమంత్రి బొత్స సత్యనారాయణకు, విజయనగరం కోలగట్ల వీరభద్రస్వామి, ఎస్.కోట కె.శ్రీనివాసరావు, నెల్లిమర్ల బి.అప్పలనాయుడు, గజపతినగరం బొత్స అప్పలనర్సయ్య, బొబ్బిలి శంబంగి వెంకట చినప్పలనాయుడు, రాజాం నుంచి తలే రాజేష్ అభ్యర్థులుగా ఎన్నికయ్యారు. విజయనగరం తాజామాజీ ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌కే మళ్లీ సీట్లు కేటాయించారు.

బొత్స అప్పలనర్సయ్య
గజపతినగరం

బి.అప్పలనాయుడు
నెల్లిమర్ల

కె,వీరభద్రస్వామి
విజయనగరం

కె.శ్రీనివాసరావు
ఎస్.కోట

డాక్టర్ తలే రాజేష్
రాజాం

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పదో తరగతి పరీక్షలు ఈనెల 18నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. పరీక్షలు నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. పదో తరగతి పరీక్షలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పేజీపై క్యూ ఆర్ కోడ్‌తో 10 ప్రశ్నా పత్రం ఉంటుందని, ప్రశ్నా పత్రంపై విద్యార్థి రోల్ నెంబరు, బార్ కోడ్, మొదటి పేజీలో మైక్రో లెటర్, ప్రతి పేజీపై నిలువునా మూడు చోట్ల యునిక్ డిజిటల్ నెంబర్ ముద్రించి ఉంటుందని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, ఏర్పాటు చేశామని చెప్పారు. మొబైల్ ఫోన్లు నిషేధిత ప్రాంతంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని ఆయన తెలిపారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు మార్చి 18 నుంచి 26 వరకు జరుగుతాయని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 5124 మంది బాలురు, 5410 మంది బాలికలు వెరసి 10,534 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఉత్తీర్ణత కాని 664 మంది విద్యార్థులు కూడా హాజరు అవుతున్నారని చెప్పారు. 66 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారుల నియామకం జరిగిందని, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. మొబైల్ నిషేధిత ప్రాంతంగా పక్కాగా అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు ఈనెల 18 నుంచి 26 వరకు జరుగుతాయని, 712 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారని, 493 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు అవుతారని చెప్పారు. 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలలకు "మై స్కూల్ మై ప్రైడ్" నినాదంతో దత్తత అధికారులను నియమించామని, ప్రతి వారం పాఠశాలను సందర్శించి మోటివేట్ చేశారని ఆయన అన్నారు. ఈ ఏడాది కూడా మంచి ఉత్తీర్ణత సాధించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, డిఇఒ జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

స్వాతీరాణికి దక్కని అవకాశం

ప్రజాశక్తి - సాలూరు

అరుకు ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చెట్టి తనూజారాణిని వైసిపి అధిష్ఠానం ప్రకటించింది. అరుకు సిటింగ్ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ కోడలైన తనూజా రాణి మొదటి సారి రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. ఆమె ఎస్టీ వాల్మీకి తెగకు చెందిన నాయకురాలు కావడంతో అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. అరుకు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స లింగం ఎస్టీ కొండ దొర, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు ఎస్టీ భగత సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఎంపి అభ్యర్థిగా ఎస్టీ వాల్మీకి తెగకు కేటాయించినట్లు తెలుస్తోంది. జిసిసి చైర్ పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి కూడా అరుకు ఎంపి సీటు ఆశించారు. అయితే ఆమె ఎస్టీ భగత సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్టీ భగత సామాజిక వర్గానికి చెందిన విశ్వేశ్వరరాజును ఎంపిక చేయడంతో స్వాతి రాణికి అవకాశం దక్కలేదని తెలుస్తోంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు ఎస్టీ నియోజక వర్గాలకు సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కనిపిస్తోంది.

రాజీయే ఉత్తమ మార్గం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కేసుల సత్వర పరిష్కారానికి రాజీయే ఉత్తమ మార్గమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు కేసుల్లో రాజీ పడడం వల్ల డబ్బు, సమయం వృథా కావన్నారు. కేసుల్లో చిక్కుకొని, కోర్టుల్లో కేసుల ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తెలిపారు. ఇరువురు కేసులను రాజీ చేసుకుని సుహృద్భావ వాతావరణాన్ని కలిగించి, మిగిలిన కక్షిదారులకు ఆదర్శంగా నిలవాలని జడ్జి కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టులు కూడా వీలైనన్ని కేసులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్ కేసులను రాజీ చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కు మొత్తం 51 కేసులు రాజీ అయ్యాయన్నారు. వీటిలో సివిల్ కేసులు 9, మెయింట్ నెన్స్ కేసులు 2, క్రిమినల్ కేసులు 35, చెక్ బౌన్స్ కేసులు 4, సారా కేసు 1, పిఎల్‌సి. కేసు 1, బ్యాంక్ పిఎల్సి ఒక కేసు రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో 6 కేసులు పరిష్కారం

కురుపాం : స్థానిక కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 6 కేసులు పరిష్కారమైనట్టు ప్రెసిడింగ్ అధికారి, లోక్ అదాలత్ చైర్మన్ ఎ.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మనోవర్తి కేసు, ఐదు క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయని చెప్పారు. ఈ అదాలత్‌లో ఎపిపి చంద్రకుమార్, న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, జి.శశిభూషన్, పరశురాం అధిక సంఖ్యలో కక్షిదారులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రమేష్

ఎన్నికల కోడ్‌తో విగ్రహాలకు ముసుగు

ప్రజాశక్తి -కొమరాడ

ఎన్నికల కోడ్ కూయడంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు తొడుగుతున్నారు. మండలంలోని అధికారుల ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో ఉన్న వివిధ పార్టీ నాయకుల విగ్రహాలతో పాటు కోడ్ నియమ నిబంధనల్లో ఉన్న వాటిని తొలగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. జంఝావతి జంక్షన్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి విఆర్ఒ పైడితల్లి, బూత్ అధికారులు ముసుగులు తొడిగారు. మండలంలో పటిష్టంగా ఎన్నికల కోడ్‌ను అమలు చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఎస్సై నీలకంఠం తెలిపారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పాటించుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా నాయకుల ఫోటోలు, బ్యానర్లు, విగ్రహాలు కనిపించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ పాటించలేదని ఫిర్యాదులు వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు.

వీరఘట్టం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు, ఫ్లెక్సీలకు తెల్లపేపర్లు కప్పివేశారు.

పాలకొండ : నగర పంచాయతీ పరిధిలోని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పక్కాగా అమలు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో శనివారం సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి, సిఎం, మంత్రుల ఫొటోలు తొలిగించాలన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రోడ్డుపై ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు.

కొమరాడలో వైఎస్ విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

వీరఘట్టంలో ప్రధాని ఫొటోపై తెల్లకాగితం అతికిస్తున్న సిబ్బంది

ప్రారంభాల పరేషాన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఇటీవల చేసిన ప్రారంభోత్సవాలు జనాన్ని పరేషాన్ చేస్తున్నాయి. ఐదేళ్లు ఊరుకుని ఎన్నికలు దగ్గరపడిన నేపథ్యంలో ఇప్పటికిప్పుడు హడావుడిగా పూర్తిచేయడం, కొన్ని ఇంకా పూర్తికాకుండానే మన జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎమ్మెల్యేలంతా కొద్ది రోజులుగా భవనాలు, రోడ్లు, కాలువలు, పార్కులు, బస్ షెల్టర్ల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కానీ, చాలా వరకు అసంపూర్తిగా ఉండడం, పూర్తిచేసిన వాటికి బిల్లులు విడుదల చేయక పోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లతో పాటు యావత్తు జిల్లా ప్రజానీకం విస్తుపోతున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ తదితర భవనాలను ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో తలపెట్టారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ సచివాలయాలు ఉండగా వీటిలో 498 సచివాలయ భవనాలు, 496 రైతు భరోసా కేంద్రాలకుగాను 291 భవనాలు, 311 వెల్‌నెస్ సెంటర్లకుగాను 178పూర్తి భవనాలు మాత్రమే నిర్మించాలని 2019లోనే ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. నిధులు విడుదల చేయక పోవడంతో 123 గ్రామ సచివాలయాలు, 126 రైతు భరోసా కేంద్రాలు, 133 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు చొప్పున మొత్తం 382 భవన నిర్మాణాలు రూఫ్‌లెవెల్, గోడలు, పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. చాలా వరకు ఏళ్ల తరబడి మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. మరో 32 గ్రామ సచివాలయాలు, 79ఆర్‌బికెలు, 124 విలేజ్ హెల్త్‌క్లీనిక్‌ల చొప్పున ఈ మూడు విభాగాలకు చెందిన 235 భవనాలకు కనీసం ప్రతిపాదనలు కూడా లేవు.

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ సచివాలయ భవనాలకు గానూ, 253భవనాల పనులు ప్రారంభించగా, 125 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. 301 ఆర్‌బికె భవనాలకు గాను, 178 నిర్మాణాలు చేపట్టగా, 100 మాత్రమే పూర్తైయ్యాయి. 192 విలేజ్ క్లీనిక్ భవన సముదాయాలు చేపట్టగా ఇందులో చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయి. మొత్తం భవన నిర్మాణాలకు సంబంధించి రూ.10కోట్ల వరకు బకాయి ప్రభుత్వం నుంచి రావాల్సివున్నట్టు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో సచివాలయ, ఆర్‌బికె, విలేజేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాల బకాయిలు సంక్రాంతిలోపే చెల్లిస్తామని, పనులు ముమ్మరం చేయాలని అంటూ జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పంచాయతీరాజ్ శాఖ అధికారులకు హామీ ఇచ్చినప్పటికీ, ఆ మాట ప్రకారం నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. అక్కడక్కడ పూర్తయిన భవనాలను మంత్రి, ఎమ్మెల్యేలు గడిచిన 15రోజులుగా తెగేసి ప్రారంభాలు చేసినప్పటికీ వాటికీ బిల్లులు చేయడంలో విఫలమయ్యారు. మరోవైపు విజయనగరంలోని పలు పార్కులు, బస్ షెల్టర్లు పూర్తికాకముందే డిప్యూటీ స్పీకర్ ప్రారంభోత్సవాలు చేయడం పట్ల జనం ఔరా...! అంటూ విస్తుపోతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడ్ చిన్మయిదేవి

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ ఆర్జెడి చిన్మయి దేవి చెప్పారు. శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బంగారమ్మ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీనుద్దేశించి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పిల్లలు విధిగా అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసిన పోషకాహారం వినియోగించుకోవాలని కోరారు. ఐరన్, కాల్షియం మాత్రలు వాడాలని సూచించారు. ఎప్పటికప్పుడు బరువులు, ఎత్తులు చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుపి హెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సిడిపిఒ బి.సత్యవతి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి నుండి కొత్తవలసకు వెళ్లే బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజల కోరిక మేరకు రూ.2.5 కోట్ల నిధులతో ఈ రోడ్డు పనులు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జి, గ్రామ సర్పంచ్ అల్లూరు తిరుపతినాయుడు, ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి సింహాచలం, మండల వైసిపి అధ్యక్షులు బి.చిట్టిరాజు, ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, బగ్గందొరవలస సర్పంచ్ అధికార నారాయణరావు, కొత్తవలస సర్పంచ్ అప్పలనాయుడు తోపాటు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిశాకే భవిష్యత్ కార్యాచరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా అలజంగి జోగారావును అధిష్టానం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ టికెట్‌ను ఆశించిన రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో పాటు ఆయన వర్గీయులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అధిష్టానం ప్రకటన విన్న తర్వాత ఆయన అభిమానులు, ఆయన ఇంటికి చేరుకుని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా పార్టీకి ఎనలేని సేవలు అందించిన తమకు ఇలా మొండి చేయి చూపడం తగదన్నారు. త్వరలోనే జగన్మోహన్ రెడ్డిని కలిసిన, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ప్రసన్నకుమార్ తెలిపారు.

విశాఖ-పార్వతీపురం ప్రధాన రహదారిపై సిసి కెమెరా అమర్చుతున్న సిబ్బంది

ఎన్నికల వేళ సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్లమెంటు, శాసనసభలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా పార్వతీపురం పట్టణానికి నలువైపులా ఉన్న మెగా వ్యవస్థను పోలీసులు పటిష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే అమర్చి ఉన్న సిసి కెమెరాలు నిర్వహణ చేయడమే కాకుండా వాటిని సక్రమంగా పనిచేసేలా తీర్చిదిద్దే పనులు శనివారం నుండి ప్రారంభమయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను, కొత్త వ్యక్తులను పసిగట్టే పనిలో సిసి కెమెరాలు పాత్ర ఉన్నందున వాటిని మరమ్మతులు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

తహశీల్దార్‌కు అస్వస్థత

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తహశీల్దార్ డివి సీతారామయ్య శనివారం యధావిధిగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి స్వల్ప అస్వస్థత గురయ్యారు. ఆయన్ను సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా డ్యూటీలో ఉన్న వైద్యాధికారి జగదీష్ ఆయనకు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యాధికారి తెలిపారు. తహశీల్దార్‌కు గత మూడు రోజులుగా జ్వరం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా ఆయన విధులకు హాజరు కాక తప్పడం లేదని తెలిపారు.

శివరాంపురంలో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

శివరాంపురంలో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని శివరాంపురంలో ఎన్నికల ప్రచారాన్ని టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గానికి ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రచార రథంలో కలియ తిరిగారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, భాస్కరరావు, బాలాజీ, కృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక తహశీల్దార్ శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కలెక్టరేట్ నుండి వచ్చారు. ఇక్కడ పనిచేసిన జి.జనార్దనరావు బలిజిపేట మండలానికి బదిలీపై వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చిల్లంగి నెపంతో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఉప్పర జమ్మి గ్రామానికి చెందిన కొండ గొర్రె రామస్వామి ఫిర్యాదు మేరకు సీతంపేట ఎస్ఐ ఎం.జగదీష్ నాయుడు కేసు దర్యాప్తు తెలిపారు. కొండగొర్రె రామస్వామికి చిల్లంగి ఉందని నెపంతో అదే గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు బిడ్డక కర్రియ్య, శ్రీను కర్రతో దాడి చేశారు. ఈ దాడిలో తలకు గాయాలవ్వడంతో రామస్వామిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగదీష్ నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో నాల్గవ విడత వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. 2970 మహిళా సంఘాలకు రూ. 5 కోట్ల 57 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ప్రభుత్వం చేయూత నిధులు అందజేస్తుందని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేటలో శనివారం జరిగిన చేయూత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 5562 మంది స్వయం సహాయక మహిళలకు రూ.10 కోట్ల 46 లక్షలకు సంబంధించిన చెక్కులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆర్థికంగా మేలు కలిగేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ భాగ్యలక్ష్మి, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పిటిసి బలగ రేవతమ్మ, స్థానిక సర్పంచి తీళ్ల కృష్ణారావు, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాథరావు, బంకురు రవికుమార్, నాయకులు బొమ్మి రమేష్, ఎండ్రాపు తిరుపతి, గురురాజు, మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్నఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

టెన్త్ విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ : ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ ఎంఇఒ-1 సామల సింహాచలం ఆల్ ద బెస్ట్ తెలిపారు. శనివారం ఆయన అరసాడ హైస్కూల్ ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్న దృష్ట్యా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఎటువంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్ రమణ, సత్యనారాయణ, గణేష్ తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యుఒ సురేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కొత్తగూడ, భద్రగిరి పిటిజి, ఎపి ఆర్ గురుకుల బాలుర పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు.

టెన్త్ తరగతి పరీక్షలకు 478 మంది విద్యార్థులు

జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలోని 12 పాఠశాలల నుంచి 478 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ తెలిపారు. కేదారిపురం కోలనీ, కోసింగి భద్ర, తాడికొండ, కొత్తగూడ, భద్రగిరి పిటిజి, ఎపి ఆర్ఎస్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం భద్రగిరి పిటిజి, ఎపి ఆర్ఎస్ గురుకుల పాఠశాల, గుమ్మలక్ష్మీపురం హైస్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే పి.ఆమిటి, టిక్కబాయి, రేగిడి, దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం రేగిడి, టిక్కబాయి ఆశ్రమ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

బలిజిపేట : విద్యార్థులకు ఆల్‌ద బెస్ట్ చెబుతున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

కురుపాం : స్థానిక కెజిబివి పాఠశాలలో టెన్త్ పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులకు కెఎన్‌బి బ్రదర్స్ అయిన కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్‌కుమార్, కురుపాం కళింగ వైశ్య సంఘ అధ్యక్షులు కె.రవి వారి తండ్రి కొత్తకోట నాగభూషణరావు జ్ఞాపకార్థం శనివారం పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థులకు పెన్నులు, ప్లాంకులను అందజేసి విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఐ.కిరణకుమారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లాకార్యదర్శి రెడ్డి వేణు

వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు, దళితులకు, వివిధ వర్గాల ప్రజలకు ప్రతి సమయంలో అండగా ఉంటున్న ఎర్ర జెండా పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించండని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని చినఖర్జేల పంచాయితీ సీసాడవలసలో సిపిఎం ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం గిరిజన ప్రజలకు, దళితులకు వివిధ వర్గాల ప్రజలకు అండదండగా ప్రతి సమయంలో ఉంటున్న ఎర్రజెండా పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపిలు గెలిపించాలని కోరారు. దళితులకు గానీ, గిరిజనులకు గానీ రాజ్యాంగపరంగా రావాల్సిన నిధులు గానీ రాజ్యాంగపరంగా అమలు చేయాల్సిన చట్టాలు అమలుపర్చేలా పోరాడే పరిస్థితి ఉందని తెలిపారు. మూడు పార్టీలు గిరిజన, దళితుల, కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కూలీల సమస్యలపై పోరాడిన పరిస్థితులల్లేవన్నారు. అలాగే ఈ మూడు పార్టీల్లో పోటీ చేసి గెలిచి అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీలో అడిగే పరిస్థితి లేదన్నారు. ఇందుకు మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలే నిదర్శమన్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో దళితులు, గిరిజనులు అనేక మంది చనిపోయినా ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. కావున రానున్న ఎన్నికల్లో గిరిజనులు, దళితులు, బిసిలు, వృత్తిదారులు, రైతులు, రైతు కూలీలు, కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల పక్షాన నికరంగా నిలిచి అన్ని వేళలా అండగా ఉండే ఎర్రజెండా తరుపున ఎవరైతే పోటీ చేస్తారో వారికి అత్యధిక ఓట్లు మెజార్టీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబమూర్తి, ప్రసాద్ గిరిజన యువతి, యువకులు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

ప్రజాశక్తి - కురుపాం

ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హిజ్రాల సంఘం నాయకులు ఎ.గీతారాణి అన్నారు. శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గిరిజన సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశమై ఎన్నికల్లో పోటీకి కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని వచ్చిన గిరిజనులు, హిజ్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందని నియోజకర్గంలో అభివృద్ధి ఎక్కడా జరగలేదని, ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారని అన్నారు. అలాగే రేషన్ కార్డులు, ఇళ్లు, చదువుకున్న హిజ్రాలకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటికీ చేయలేదన్నారు. అవకాశం ఇస్తే రానున్న ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పల్లా సురేష్, ఆరిక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణతో మళ్లీ గెలుస్తా

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వైసిపి అధిష్టానం పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావుకు రెండోసారి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంపై ఆయన స్పందించారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ, అన్ని వర్గాల ఆదరాభిమానాలు సంపాదించుకున్నానని తెలిపారు. అందుకు తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ప్రజలు తమ సేవకుడిగా గుర్తించి నియోజవర్గంలో ఏ ఎమ్మెల్యేకు లేని ఆదరాభిమానాలు తనపై చూపించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. వారి అండదండలతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపు సాధించి వారి సేవ చేసుకుంటానని అన్నారు.

జోగారావు అభిమానులు సంబరాలు

పార్వతీపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం రెండో సారి అలజంగి జోగారావుకు టికెట్ ప్రకటించడంతో నియోజకవర్గంలో ఆయన అభిమానులు, వైసిపి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. టికెట్టు ఆయనకే కేటాయించిన వార్త విని ఆయన నివాసానికి భారీ ఎత్తున అభిమానులు చేరుకుని అభినందనలు తెలిపారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - గరుగుబల్లి

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను మండల పరిధిలోని ఖడ్గవలస జంక్షన్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటి నాయుడు (రాంబాబు)లు పూలమాలలు వేసి నివాళు లర్పిం చారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని ఈసందర్భముగా పేర్కొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అమరజీవి పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుమ్మలక్ష్మీపురం మండల ఎటిడబ్ల్యుఒ బి.సురేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలికల (పిటిజి) పాఠశాలలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరగకుండా పోరాటం చేసిన యోధుడు పొట్టి శ్రీరాములని అన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భారతి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న టిడిపి నాయకులు మధుసూదనరావు

గుంప ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి, నాగావళి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో చుట్టూ రిటర్నింగ్ వాల్ పనులకు ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కృషితో రాష్ట్ర దేవాదాయ శాఖ నుంచి కోటి రూపాయలు నిధులను కేటాయించారు. ఆలయ ప్రాంగణం నది వరద పోటుకు గురై కొట్టుకుపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయం చుట్టూ రిటర్నింగ్ వాలు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇప్పటికే ఆలయంలో పలు అభివృద్ధి పనులు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారంతో పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. కాపారపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిధులు సమకూర్చి నది మీద నుంచి రాకుండా చిన్నగట్టు కట్టడంతో ఆలయ ప్రాంగణం వరకు వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం, దేవాదాయశాఖ, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేందుకు కృషి చేస్తామని తెలిపారు. పనులు వేగంగా ప్రారంభించి వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని దేవాదాయ శాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్, నాయకులు శెట్టి మధుసూదన్ రావు, కోటిపాం సర్పంచ్ ఎస్.సుగుణ, ఎంపిటిసిలు సురేష్, పార్వతీ, ఆలయ ఇఒ ప్రసాద్, వైసిపి నాయకులు భాస్కరరావు, అర్చకులు దేవి బాబు, చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పదవుల భర్తీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో తెలుగుదేశం పార్టీలో పలు పదవులను భర్తీ చేసినట్లు టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర తెలిపారు. శనివారం తన నివాసంలో సంబంధిత నియామక పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం నియోజకవర్గం పొలిటికల్ మేనేజర్‌గా వంగల దాలి నాయుడును, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులుగా గొర్లి వెంకట రమణారావు (ఈనాడు రమణ)ను, నియోజకవర్గం తెలుగు యువత కమిటీ ప్రెసిడెంట్‌గా సిగడాం భాస్కరరావును, పార్వతీపురం రూరల్ తెలుగు యువత అధ్యక్షులుగా చుక్క పోలినాయుడును నియమించినట్లు తెలిపారు. ఈ రోజు నుంచి వారు వారి బాధ్యతలను నిర్వర్తిస్తారన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు నియోజకవర్గం ప్రజలు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన దాలినాయుడు, జివి రమణ రావు, సిగడాం భాస్కరరావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమతో పాటు నియోజకవర్గ ప్రజలందరిపైనా ఉందన్నారు. ఇప్పటికే పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు కనీస సౌకర్యాలందే పరిస్థితి లేదన్నారు. ఎక్కడ చూసినా, దోపిడీ, దౌర్జన్యం, అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయన్నారు. వాటి నుండి నియోజకవర్గాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తమపై నమ్మకం ఉంచి, బాధ్యతలు అప్పగించిన బోనెల విజయ్ చంద్రకు ధన్యవాదాలు తెలిపారు. తమ శక్తి వంచన లేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తామని తెలిపారు. క్రమంలో అందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా హరగోపాల్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వేమూరు హరగోపాల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జోన్ -1 పరిధిలో పలువురు జూనియర్ లెక్చరర్లకు ఇంటర్ కమిషనర్ శుక్రవారం ఉద్యోగోన్నతలు కల్పించారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న హరగోపాల్ ఉద్యోగోన్నతిపై పాలకొండ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్‌గా చేరారు. గతంలో రాజాం, వంగర జూనియర్ కళాశాలలో పనిచేశారు. ఇప్పటి వరకు పైల శంకరరావు ప్రిన్సిపల్‌గా(ఎఫ్ ఎ సి) కొనసాగారు.

ప్రిన్సిపల్‌గా ఎస్ఎల్‌వి నారాయణరావు

భామిని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఎస్ఎల్‌వి నారాయణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఆమదాలవలస జిజె కాలేజీ ఇంగ్లీష్ లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావుకు, భామిని కళాశాల సిబ్బంది పుష్ప గుచ్చం తో అభినందనలు తెలిపారు.

చిన మేరంగి కళాశాల ప్రిన్సిపల్‌గా రమణ

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా సవరపు రమణ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన విజయనగరం జిల్లా నెల్లిమర్ల జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయనను స్థానిక కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహసహకారాలతో కళాశాల పేరును కాపాడుతానని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరావు, గణపతి, మహరాణి, ప్రసాద్, సంజయ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ బదిలీ

సీతానగరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఫ్ఎసి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న దాసరి త్రినాథ్‌కు వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐగా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎస్సైగా ఎస్‌కె ఫక్రుద్దీన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పార్వతీపురంలో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎం.గోవింద్ ఈనెల 15న తెట్టంగిలో నిర్వహించిన పోలీస్ కవాతును రాజకీయ నాయకులతో కలిసి జరిపినట్లు వచ్చిన ఆరోపణతో పాటు ఎన్నికలను ఉల్లంఘించినట్లు జిల్లా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విఆర్‌లో ఉంచినట్టు సమాచారం.

సమిష్టిగా పనిచేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరగాలంటే సమిష్టంగా పనిచేయాలని గంగంపేట గిరిజన ఆశ్రమం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం సిఎస్ ఎం ఈశ్వరరావు , డిపార్ట్మెంటల్ అధికారి యు అప్పారావులు సిబ్బంది సూచించారు. శనివారం గంగంపేట గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాలలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాన ద్వారం వద్ద సిబ్బంది నుంచి విద్యార్థులు తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలకు పంపించాలన్నారు. విద్యార్థుల వద్ద హాల్ టికెట్ తప్ప మరి ఏ విధమైన పరికరాలు ఉండ కూడదన్నారు. ఆ విధంగా ఉంటే విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

జనన, మరణాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జనన, మరణాల నమోదు తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణ, తాగు నీటి సరఫరా, ఉపాధి హామీ, వైద్య, ఆరోగ్య శాఖలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన, మరణాల చట్టం 2023 గత ఏడాది అక్టోబర్ 1నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం విద్యా సంస్థల్లో చేరేందుకు, డ్రైవింగ్ లైసెన్స్ జారీకి, ఓటరు జాబితా తయారీకి, వివాహ నమోదుకు, ఉద్యోగాల్లో చేరేందుకు, పాస్ పోర్ట్, ఆధార్ కార్డుల జారీకి లేదా కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఏ ఇతర కార్యక్రమానికైనా విధిగా సమర్పించాలని స్పష్టం చేశారు. జనన, మరణాలను 30 రోజుల్లో నమోదు చేయాలని, నమోదు చేసిన ఏడు రోజుల్లో ధ్రువీకరణ పత్రం జారీ జరుగుతుందని తెలిపారు. జనన, మరణాల 30 రోజులు దాటి, ఏడాదిలోపు నమోదు చేసుకుంటే జిల్లా రిజిస్ట్రార్‌గా వ్యవహరించే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నిబంధనల మేరకు జారీ చేస్తారని, ఏడాది తరువాత నమోదు చేస్తే నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్ లేదా జిల్లా కలెక్టర్ అధీకృత అధికారిగా వ్యవహరించే సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ జారీ చేస్తారని వివరించారు. దత్తత తీసుకున్నవారికి, అనాథలుగా ఉన్నవారికి, విడిచిపెట్టిన వారిని, సరోగసి విధానంలో జన్మించిన వారికి సంబంధిత దక్షత వహిస్తున్న వ్యక్తులు సమాచారం అందించాలని ఆయన స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఎస్‌డిసి జి.సూర్యనారాయణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.7.50లక్షలకు సంత వేలం పాట

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక సంత వేలం పాట పాలకొండ డిఎల్‌పిఒ రాంప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ సంత వేలంపాటలో 30మంది పాల్గొనగా సర్కారు వారి పాట నాలుగు లక్షల 90వేలు నిర్ణయించగా, పనుకువలసకు చెందిన కె.వినోద్ కుమార్ రూ.ఏడు లక్షల 50 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ కళావతి కార్యదర్శి బి సుదర్శన్ రావు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.